# కలసివచ్చిన - నాకారు

**నా** మోటారు వాహనం అంటే అది నాది అని అందరికీ సులభంగానే అవగాహన అవుతుందని నా నమ్మకం. నాది అంటే సంపాదించింది, సేకరించింది, కొన్నది, దానంగా స్వీకరించింది, బహుమానం పేరిట లంచంగా పొందింది, పూర్వులనుంచి సంక్రమించింది. వీటిల్లో ఏదైనా కావచ్చుకదా ఇందులో మీ వాహనం ఏవర్గానికి చెందిందోకూడా చెప్పకూడదా అని మీరు అడగవచ్చు. మీరు గట్టిగా మరోసారి నోరు చేసుకోకముందే చెబుతాను "ఇదంతా నా స్వార్జితం- నా కష్టార్జితం అని గొప్పలు చెప్పకోవడం నా స్వభావం కాదు- అందులోనూ కాని వాటి విషయంలో.

ఈ కారు మా తాతగారి దగ్గరనుంచి సరాసరి నాకు లభించింది. లభించాయని అంటాను ఎందుకంటే అవి రెండు కనుక. వాస్తవానికి ఇవి రెండూ నాకు విడిగా ఉచితంగా సంక్రమించిన ఆస్తులు. వీటిని మీరు చరాస్థి అని కానీ స్థిరాస్తి అని కానీ పిలవవచ్చు. ఎలా పిల్చినా అన్వయం కుదురుతుంది. మా తాతగారి ఆస్తిఅంతా మానాన్న, మా పెద్దనాన్న, బాబాయిలు వాటాలు వేసుకొంటున్న సమయంలో మా తాతగారు రెండు మోటారు వాహనాలను నాకు ప్రత్యేకంగా ఇచ్చారు. మిగతావాళ్ల ఆయనపెట్టిన షరతులు విన్నాక అవి మాకు వద్దంటే మాకు వద్దు అన్నారు. నేను (వాళ్లకంటె) చిన్నవాణ్ణి కావడంచేతా, తాతగారి షరతులకు సంతోషంగా వెంటనే ఆమోదం తెలియజేయడంచేతా,

నేను సరే అనకముందే ఆయనకు నామీద అభిమానంతో పాటు నమ్మకం ఉండడంచేతా వీటి అన్నింటినీమించి నాకు మోటారు వాహనాలంటే ఎంతో ఆసక్తి ఉండడంచేతా అవి నాకు ఇచ్చారు. ఎవ్వరూ అడ్డు తగలలేదు నేను ఎంతో సంతోషంగా స్వీకరించాను.

ఇలా సంక్రమించినవి రెండు. ఇవి మొదటిది మోటారుకారు. రెండోది మోటారు సైకిలు. లేదా అట్నుంచి చెబుతే మొదటిది మోటారు సైకిలు రెండోది మోటారుకారు. కానీ మా తాతగారు నిర్ణయించింది మొదటివరుస. అందుచేత నేను అలా పేర్కొనడం జరిగింది. కొంతవయస్సు వస్తేగాని మోటారు సైకిలు వాడుకంలోకి తీసుకొనిరావద్దని ఆయన ఆదేశించారు కూడానూ.

మొదట్లో మోటారుకారు నేను ఎక్కువగా వాడుకోలేదు. తాతగారు నన్ను హెచ్చరిస్తూ ఉండేవారు "అది వాడకపోతేపూర్తిగా చెడిపోతుందిరా" అని. మధ్యమధ్య తన షరతుల విషయం కూడా నాకు జ్ఞాపకంచేస్తూ ఉండేవారు. "ఇప్పుడుమాత్రం పాడై పాతదైలేదా" అని అనడానికి నాకు ధైర్యమూలేదు. అలా అనడానికి నాకు మనస్కరించనూలేదు.

అది కొన్నప్పుడు కొత్తదే. కాని తర్వాత తర్వాత పాతదైంది. ఆ కారు నడవడంలో మెలకువలు, స్వల్పమైన మరమ్మతులు వెంటనే చేసే పద్ధతులు ఆయన నాకు స్వయంగా నేర్పారు. కాని అవి నాకు అంతగా వినియోగ పడలేదు. నేను స్వయంగా అందుకు సంబంధించి అనేక విషయాలు నేర్చుకోవలసి వచ్చింది. ఆ యా సందర్భాలలో ఎంతో సహనం వహించవలసి వచ్చింది. నాకు సహనం అంటూ ఏకొంత అయినా అబ్బిందీ అంటే అది నా కారు పెట్టిన భిక్షఅనే చెప్పాలి. మామూలుకార్లు ఎత్తు ఎక్కేటప్పుడు ఆగి ఇంక ఎక్కనని

మొరాయిస్తాయి. మొరాయిస్తూ వెనక్కు నడవడం కూడా కద్దు. కాని నా కారు అలా కాదు. పల్లానికి వెళ్ళేటప్పుడు, స్లోపులో క్రిందికి దిగేటప్పుడు చప్పున ప్రక్కకు తిరిగిపోయి పెద్ద ఏనుగులా రోడ్డుకు అడ్డం నిలబడి ఇంక ఎటూవెళ్ళనని మంకుపట్టు పడుతుంది. అప్పుడు నిజంగా ఎంత సహనం కావాలో.

ఇదేమిటి పల్లానికి స్లోపులో కారు అలాగ్గా అలా అలా దొర్లి పోతున్నట్లుగా వెళుతుందికదా అసలు ఇంజను ఆపేసి కళ్ళుమూసుకొని కూర్చోవచ్చు కదా అనవచ్చు మీరు. నాకారు స్వయంగా కళ్ళారా చూడలేదు కనుక మీకు అటువంటి అనుమానం రావడం, మీరలా ఊహ చెయ్యడం సహజమే కాని మీఊహ సరియైనది కాదు అని మాత్రమే అంటాను. అదీకాక నా కారుకుఉన్న ఊహాశక్తి మహా కవులకు, మహా రచయితలకు కూడా ఉండదు. అందులోనూ శాస్త్రకారులు కోరే "వక్రత" విషయంలో నా కారుదే అగ్రతాంబూలం. అందుకు నిదర్శనం గమిస్తూ అది తిరిగే మలుపులు. బాగా చెయ్యితిరిగిన రచయిత కూడా కథలో అన్ని మెలికలు అన్నిమలపులు ప్రదర్శించలేడని నా అభిప్రాయం. ధ్వనికారులు కూడా నాకారుకు తలవంచవలసిందే దానిధ్వని వైభవం ముందు ఇంతే కాదు నాకారు విషయంలో అభినందిచవలసిన అంశం మరొకటి కూడా ఉన్నది. అది ఆవేగం. మరీ ఎత్తు పల్లాలులేని రోడ్డు మీద అయితే అది మేఘాల మీద ఎక్కడా ఆగకుండా పరుగెడుతుంది. వాయుమనోవేగాలను నిజంగా అధిగమిస్తోందా అనిపిస్తుంది ఆ సమయంలో. అయితే ఎప్పుడు ఆ వేగం అందుకొంటుందో తెలియదు. అదే విధంగా ఎప్పుడు ఆగిపోతుందో కూడా తెలియదు.

ఆకారు విషయం బాగా తెలిసిన నాకే తెలియదు ఇంక ఇతరులకు ఎలా తెలుస్తుంది! ఆఖరికి బ్రహ్మగారికి కూడా తెలియదు. కష్టపడి అడ్రసుకనుక్కొని ఫోనుచేసినా ఆయన "నాయనా నాకుదాని విషయం

మాత్రం తెలియదు" అంటారని నా గట్టినమ్మకం. ఈ ఒక్క విషయమే కాదు. అది చెడితే బాగు చెయ్యడం కూడా ఎవ్వరికీ తెలియదు. విప్ప దీసిచూస్తే అన్ని భాగాలు బాగానే ఉంటాయి. కాస్త దుమ్ము పేరు కొన్నట్టు కూడా కన్పించదు. కాని పనిచెయ్యదు. లోపం ఎక్కడ ఉన్నదీ తెలియదు.

ఒకసారి ఇలాంటిదే జరిగింది. ఇక ఆ తర్వాత మళ్ళీ అలాంటిది జరగలేదు కనుక అది నాకారు చరిత్రలో ప్రధాన ఘట్టం. అందుకని ఆ ఒక్క విషయం చెప్పక తప్పదం లేదు. అర్జెంటు కేసు వచ్చింది. మరీ అర్జెంటుగా వెళ్ళవలసీ వచ్చింది. వెళ్ళవలసింది పరుగు మేర దూరంలో ఉంటే అలాగే వెళ్ళేవాణ్ణి. అదే నాకు సులభం కూడానూ. అలా అయితే ఎవరిమీదా ఆధార పడక్కర్లేదు. హాయిగా వెళ్లవచ్చు. వెళ్ళి త్వరగా తిరిగిరానూ రావచ్చు. ఎవరైనా నవ్వుతారని అనవచ్చు మీరు. కాని ఎవరో నవ్వుతారని ఆపనిమానేసే రోజులు కావవి. సిరిరా మోకాలులొడ్డే రోజులు కావవి. ఆలస్యం చెయ్యడానికి అవకాశం లేని రోజులవి. ఆలస్యం చేస్తే నా అదృష్టవశాత్తు కన్పించిన ఆరోగ లక్షణం అదృశ్యం కావచ్చు. అంటే దానంతట అదే తగ్గిపోవచ్చు. ఫలితంగా వైద్యం చేసే అవకాశం పోవచ్చు. అంతేకాదు మరో వైద్యుడు అక్కడ ప్రత్యక్షమయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు. కాని అప్పుడు వెళ్లవలసింది చాలాదూరం. దాదాపు యాభై మైళ్ళ పైచిలుకు వెళ్లాలి. మరో మార్గం కన్పించక ఇక తప్పదని నాకారు బయటకు తీశాను. తాతగారు విషయం అంతావిని సంతోషించి బయటకు వచ్చి "ఊరుదాటేదాక గేరు మార్చకు" అని సలహా చెప్పారు. నేను సరేనని రోగి దగ్గరకు తీసుకొని వెళ్లడానికి వచ్చిన ఇద్దరు ఆసాములు తొందరపెడితే వెంటనే బయలుదేరి పెట్రోల్ బంకు దగ్గర టాంకునిండా పెట్రోలు నింపు కొన్నాను. టైర్లలో గాలి ఉందో లేదో చూచి మరో పెద్దకాన్ నిండా పెట్రోలు నింపి కారులో

పెట్టాడా 'బంకు మనిషి' ఇదంతా జరూర్‌గా జరిగింది కనుక అయిదు నిముషాలకంటే ఎక్కువసేపు పట్టలేదు.

మరో రెండు నిముషాలకు ఊరి బయటకు వచ్చేశాం. రద్దీలేదు. పైగా రాత్రి ప్రయాణం కనుక ఏమీభయం లేదనుకొన్నాను. అయినా ఎందుకైనా మంచిదని నా వెంటఉన్న ఇద్దరు ఆసాముల్ని "బండి"కి చెరోవైపు నిలబడి హారన్ కొడుతూ హెచ్చరిక చేస్తూ ఉండమన్నాను. ఈ ఏర్పాటు పూర్తి అయ్యాక గేరు మార్చాను. కాని నా మోటారుకారు తాపీగా నడుస్తున్నది. కొంచెంసేపు చూచి, నెమ్మదిగా కోపంవచ్చి ఫుల్ గేర్‌లో పెట్టాను. కాని పెద్దమార్పు కన్పించలేదు. ముందుకు సాగిపోతోంది.

మా ఊరినుండి ట్రంకు రోడ్డు మీదకు వచ్చేదారిలో మలుపు తిరిగీ తిరగడంతో నాకారు హఠాత్తుగా అద్భుత వేగం అందుకొన్నది. అదీ ఎంత వేగమంటే మరోక్షణంలో ట్రంక్ రోడ్డు మీద అప్పటికే అయిదారు ఫర్లాంగులు వచ్చేశాము మరోక్షణం తర్వాత ఏదో లోటుగా కన్పిస్తే తల త్రిప్పకుండానే ఎడమచేతి వైపుకు దృష్టి మళ్లించాను. అంతకు ముందు అక్కడ నిలబడ్డమనిషి లేడు కారు ఆపడానికి ప్రయత్నం చేశాను కాని ఆ ప్రయత్నం విఫలమైంది. కారు పరుగెడు తోంది కొండమీదనుంచి దొర్లిపోతున్న బండలాగా, మెయిలుబండిలాగా, కాదు ఎక్స్‌ప్రెస్‌లాగా. మామూలు జనతా ఎక్స్‌ప్రెస్‌లాగా కాదు జి. టి. లాగా వెళుతున్నది. జి. టి. అయినా కొన్నిచోట్ల ఆగుతుంది కాని నాకారు మాత్రం ఆగదు.

నాకుడిచేతి వైపుఉన్న రోగి తాలూకు మనిషి నాకారు వేగానికి ఆశ్చర్యపడుతూ అంతకంటే ఎక్కువగా భయపడుతూ పెద్దగా "పోనీండి ఆపడం మరీ ప్రమాదం. బ్రిడ్జీ వస్తోంది" అన్నాడు. అతని మాటలు నాకు విన్పించడం పూర్తిఅయ్యేసరికే మాకారు బ్రిడ్జీ దాటేసింది.

దారి పొడుగూతా రోడ్డు గతుకులు - గుంటలు. విదేశాలనుంచి ఆంధ్రదేశం వచ్చాక నా కారుకు డొంకల వంటి ఈ జాతీయ రహదారులలో ప్రయాణం చెయ్యడం క్రమంగా అలవాటు అయ్యింది. అదీ కాక నాకారుకు క్రిందచూపులేదు. కనుకనే కోపం రాలేదు అవమానంగా భావించలేదు. ఉన్నదల్లా ముందుచూపే కనుక క్షణంలో మైళ్ళదూరం సాగిపోయింది. నా కారుధాటికి నిలువలేకనే కాబోలు పల్లెలకు పల్లెలు, గ్రామాలకు గ్రామాలు వెనక్కు పరుగెత్తాయి. బ్రహ్మాండంగా పెరిగిన చెట్లు కూడా కారు గమించే మార్గానికి ఇరువైపులా నిలబడి స్వాగతం-వీడ్కోలు కలిపి చెప్పాయి. అడ్డురాలేదు. దారికడ్డం ఏదీ రాలేదు. కెనడా రైలు ఇంజన్లా శబ్దంచేస్తూ, ప్రళయ ప్రభంజనంలా వస్తున్న నాకారు ముందుకు రావడానికి వేటికీ, ఎవరికి ధైర్యం ఉంది? ప్రాణభయం అందరికీ- జీవకోటి అంతటికీ సహజమే కదా!

దారిలో ఒకటి రెండుచోట్ల "హద్దు మీరరాదు" అని చెప్పవచ్చిన వాటిని చెంపదెబ్బ కొట్టి మరీ ముందుకు సాగింది.

12 అడుగుల పొడవూ, ఆరు అడుగుల వెడల్పూ ఉన్న నాకారు వెడుతుంటే అంత పెద్ద వాహనం వెళుతున్నట్టు ఉండదు. పాము జరజరా పాకి వెళుతున్నట్టు, పెద్ద ఇనుపకడ్డీ బల్లెంలా దూసుకొని పోతున్నట్టు ఉంటుంది.

నాకెంతో సరదా అనిపించింది. అప్పటిదాకా భయంతో కొయ్యబారి పోయినట్లు గట్టిగా పళ్ళుబిగించి, కారు పట్టుకొని నిలబడ్డ రోగితాలుకు రెండో మనిషి ఒక్కసారి పెద్దగా హారన్ "స్వరం" మించిన స్థాయిలో "డాక్టర్! ఇంక మీరు ఆపక తప్పదు. ఊర్లోకి వచ్చేశాం" అని అరిచాడు. ఆపడానికి ఎన్నోవిధాల ప్రయత్నం చేశాను. ఆపగా ఆపగా వెళ్ళి వెళ్ళి ఊరిచివర మైదానంలో పెద్ద మఱ్ఱిచెట్టు క్రింద ఆగింది. చెట్టుకు గుద్దుకొని మరీ ఆగింది.

అవసరమైన సామాన్లు మోసుకొని వెళ్లాం సరాసరి రోగిదగ్గరకు.

ఆయన రోగిగారు.

ఎందుకంటే ఆయన ఒక చిన్న జమీందారు. అందుకనే పెద్ద పందిరి వట్టె మంచంపై పడుకొనే స్వాగత కార్యక్రమం నిర్వహించారు.

ఆ తర్వాత నిదానంగా "అరే అప్పుడే ఎలా రాగలిగారండీ" అని ఆశ్చర్యం ప్రదర్శించడం మాట పూర్తికాకముందే నావెంట వచ్చిన ఆయనగారి తాలూకు మనిషి "సరిగ్గా గంటన్నరక్రితం బయలుదేరాం. వచ్చేశాం. తమ పునర్దర్శనం లభిస్తుందని దారిలో నామట్టుకు నేను అనుకోలేదండీ-" అని జవాబు చెప్పాడు.

ఆయనకు చికిత్స- జరూర్‌గా చెయ్యవలసి వచ్చిన శస్త్రచికిత్స అంతా అయ్యేసరికి రాత్రి పది దాటింది.

వారింట్లో మండువాలో ప్రక్కవేస్తే అక్కడ నిద్రపట్టక నాకారు దగ్గరకు వెళ్లాను. వెనుకసీటుమీద ప్రక్క పరుచుకొని పడుకొన్నా. "ఆపరేషనైతే జయప్రదంగానే చేశాను. కానేమైనా రేపటికి నమ్మకంగా ..." అనుకొంటూ చెయ్యవలసిన విధి నిర్వహించాను అని సంతృప్తిపడి నిద్రపోయాను.

మరునాడు నిద్రలేచేసరికి రెండు విషయాలు హఠాత్తుగా తెలిశాయి.

ఏమో ఏమవుతాడో అనుకున్న రోగిగారు జబ్బు అంతవేగం నయమై నిక్షేపంలా లేచికూర్చుని లేచి తిరగవచ్చునేమో డాక్టర్ని అడగమంటున్నారనీ, ఇటు ఇంతవేగంగా వచ్చి అంచక్కా విశ్రాంతి తీసుకొని మళ్లా ప్రయాణానికి సిద్ధంకావలసిన సమయంలో నా కారు అకారణంగా చెడిఊరుకొన్నదనీ తెలిసింది.

నాకెంతో నిరుత్సాహం కలిగింది. జమీందారుగారు రెండు మూడు రోజులు అక్కడే ఉండిపొమ్మన్నాడు. తన కీలోపల పూర్తిగా నయమై కట్టు విప్పదీయడం, మరోవంక నా కారుకు అవసరమైన మరమ్మతులు పూర్తిచేయడం జరుగుతాయని ఆయన సెలవిచ్చారు.

నాకు మరోమార్గం లేకపోయింది. అంతలావు జమీందారుగారికీ ఒక చిన్న పాతకారుఅయినా లేకపోయింది.

రోగి విషయం నేను ఊళ్లోఉండి చూచుకొనేటట్లూ కారు విషయం దివాన్‌గారు చూచేటట్లూ ఏర్పాట్లు జరిగాయి.

అలా ఏర్పాటు జరిగిన మరునాడే దివాన్‌గారికి నా కారు విషయంలో పట్టుదల పెరిగింది. దగ్గరలో అందుబాటులో ఉన్న పనివారివల్ల ప్రయోజనం కలక్కపొయ్యేసరికి ఆయనకు పౌరుషం వంటిది వచ్చింది.

ఆ పౌరుషంతోనే ఆయన యాభైమైళ్ళ దూరంలో ఉన్న వివిధ పట్టణాలకు కబురుపెడితే మోటారు వాహనాలకు, మోటారు ఇంజన్లకూ మరమ్మతులు చేసే నిపుణులైన పనివారూ, పెద్దలారీ, టాక్సీ కంపెనీలకు చెందిన కొంతమంది సాంకేతికజ్ఞులు విచ్చేశారు. ఎంతో ప్రయత్నం చేశారు కాని "మావల్లకాదిది" అని నిండు హృదయంతో నమస్కరించి, పూర్తి నిస్పృహతో తిరిగి వెళ్లిపోయారు.

దివాన్‌గారు స్వయంగా కలం పుచ్చుకొని మాకారు కంపెనీ ఏజంట్లకు ఉత్తరం వ్రాశారు. ఆ ఉత్తరం ఎక్స్‌ప్రెస్ డెలివరీలో వెళ్ళింది ప్రక్కన అంటే ఇరవైమైళ్ళ అవతలఉన్న చిన్నపట్టణం నుంచి ఆ కంపెనీవారు జవాబు వ్రాశారు. ఆ రకం కార్లు ప్రస్తుతం షుమారు రెండు మూడు దశాబ్దాలుగా అమ్మకానికి మార్కెట్‌లోకి రావడంలేదనీ, అయినా దాని వ్యవహారం ఢిల్లీలో ఉన్న ఒక జర్మన్

కంపెనీతో సంప్రదించి పరిష్కారమార్గం సూచించడానికి ప్రయత్నిస్తా మనీ ఆ ఉత్తరంలో వివరించబడింది. దివాన్‌గారు సరే అంటూ టెలిగ్రామ్ పంపారు

ఆ మరునాడు "నేనింక వెళ్లాలి వారికి బాగా నయమైంది. పత్యం కూడా పెట్టి రెండు రోజులైంది ఇంటిదగ్గర ప్రాక్టీసు ఏమైందో! అంతకంటే ముఖ్యం మావాళ్ళు అదుర్దా పడుతుంటారు. ఈలోపల కారుకు నయమవుతుందేమో అనుకొన్నా" అన్నాను నవ్వుతూ. ఆయన కూడా మునిముని నవ్వులు నవ్వారు.

మీ కారుకు ఏ ప్రమాదం రానివ్వనెండి అని దివాన్‌గారు నాకు సెలవు ఇప్పించారు నా సరదా తీరేదాకా కొంతదూరం గుఱ్ఱంమీదా రాత్రిపూట సుఖంగా నిద్రపోతూ రెండెడ్ల బండిలోనూ ప్రయాణంచేసి నేను మరో మూడు రోజులకు మా యిల్లు చేరుకొన్నాను.

ఊరివారే కాదు మా యింట్లో వాళ్లు కూడా బయటకు వచ్చి విరగబడి చూచారు.

అటు మా తాతగారూ ఇటు ఇంట్లో పిల్లలూ సరదాపడితే ఆ గుఱ్ఱాన్ని మాత్రం మా దొడ్లోకట్టేసి తిరిగి వెళ్లారు జమీందారుగారి మనుష్యులు. వాళ్ళు వెళ్ళి చెప్పారు కాబోలు దివాన్‌గారు ఉత్తరం వ్రాశారు మా తాతగారికి "ఆ గుఱ్ఱం మీరు తీసేసుకోండి. అది ఒకప్పుడు మంచి రేసుగుఱ్ఱం. కాని ఇప్పుడు ముసల్ది కావడంచేత పెద్దగా పనికి రావడంలేదు మీకు స్వారీకి కావాలంటే మరోటి పంపమంటే పంపుతాను" అని వ్రాశారాయన.

హార్స్‌పవర్ కనీసం రెండైనా లేకపోతే ఎలా అనుకొనే స్వభావం కలవారు కనుక మా తాతగారు ఒప్పుకొన్నారు. కాని మా అమ్మ ఇంకా

నయం గుణ్ణాలు దేనికండీ అనీ, వాటిని మేపలేక దుంపతెగుతుందనీ చెప్పి వారించింది

నేను మా గ్రామం చేరిన పది రోజుల తర్వాత మహాదర్జాగా బ్రహ్మాండమైన ఏకశిలా విగ్రహంలా లారీలో ఎక్కి వచ్చింది నా కారు.

దాన్ని అలా తెచ్చినవాళ్లే నెమ్మదిగా గారేజీలో పెట్టి ఇరు ప్రక్కలా తాళాలువేసి తాళంచేతులు నాకు ఇచ్చివెళ్లారు. మా వదినగారు నా భవిష్యత్తు, సంక్షేమం దృష్ట్యా అవి నా చేతిలో ఉండడం మంచిది కాదని వాటిని నా దగ్గరనుంచి జప్తుచేసుకొని దాచేసింది.

ఆ తర్వాత నెల రోజులకు దివాన్‌గారు నాకు ఉత్తరం వ్రాశారు. ఢిల్లీలో ఉన్న కంపెనీవారు తనకు జాబు వ్రాశారనీ, అందులో పూర్వం మా కారు తయారుచేసిన జర్మన్ మోటారు వాహనాల తయారీ సంస్థ ప్రస్తుతం కార్లవంటి స్వల్పవిషయాలు పట్టించుకోవడం మానేసి బహుకాల మైందనీ, ఆ సంస్థ ఇప్పుడు బ్రహ్మాండమైన విమానాల తయారీ సంస్థగా రూపొందిందనీ, అయినా మాకీ విషయంలో సహాయం చెయ్యవలసిందని అభ్యర్థించడం జరిగిందనీ, త్వరలో కాకపోయినా ఆద్యతన భవిష్యత్తులో అటువంటి సహాయం లభించే అవకాశం లేకపోలేదనీ తెలియచేశారట.

దివాన్‌గారు ఉత్తరం ముగిస్తూ 'మీరేమీ బెంగపెట్టుకోవద్దు నేను నా పలుకుబడి అంతా వినియోగించి ఈ విషయం పరిష్కరిస్తాను' అని వ్రాశారు.

దివాన్‌గారికి గొప్ప పట్టుదలే కలిగింది. ఇదంతా విని మా వదినగారు ఒకసారి నవ్వుతూనే అడిగింది, "ఏమయ్యా ఇంతకూ ఆయన ఫీజు ఏమైనా ఇచ్చాడా? లేక ఈ మరమ్మతులకూ దానికీ చెల్లు అన్నాడా" అని నేను నవ్వి ఊరుకొన్నాను.

'జమీందార్లను అంత తేలిగ్గా ఫీజు ఇమ్మని అడగకూడదు. ఒకవేళ అడిగిఉంటే ఆయన పాతికో యాభై యో్య చేతిలోపెట్టి కారు మరమ్మతుకు అయిన ఖర్చు అంతే భరించమని అనేవాడే!' అనుకొన్నాను. ఆ భయం నాకు మొదటినుంచీ ఉంది. అందుకనే నేనా విషయం ఎత్తలేదు.

ఆ తర్వాత ఆరు నెలలకు దివాన్‌గారి పట్టుదల మూలంగానే నా కారు విషయం పరిష్కారమైంది.

జర్మన్ విమానాల కంపెనీ భారతదేశానికి విమానాల విడిభాగాలు అమ్మ చూపడానికి ప్రతినిధులను పంపింది. వారికి ఆ కంపెనీకి చెందిన ఒక సుప్రసిద్ధ ఇంజనీరు నాయకత్వం వహించారు. ఆయన ఇంజనీరింగ్ లోనేకాక వయస్సులో కూడా చాలా పెద్దవాడు. ఆయన వచ్చిన పని అయ్యాక దివాన్‌గారు ఇన్నాళ్ళూ సంప్రదింపులు జరుపుతున్న ఢిల్లీ కంపెనీ మేనేజరు ఏదో ప్రసంగంలో నవ్వులాటకు నాకారు విషయం ప్రస్తావించాడట. అంతే- దాంతో ఆయన నా అడ్రసు కనుక్కొని నరాసరి రెక్కలు కట్టుకొని అంతదూరంనుంచి మా యింటికి వచ్చాడు.

ఆయన నేను ఫలానా అని పరిచయం చేసుకొనేవరకూ ఎవరో మందుల కంపెనీ ఏజెంటు అనుకొన్నా. తీరా ఆయన "నేను మీ కారు తీసుకొంటాను. అందు కే వచ్చాను" అనేసరికి నా ఆశ్చర్యానికి అంతులేక పోయింది తీసి చూపమంటే గారేజినుంచి తీయించి చూపాను.

ఆయన ఒకసారి కారు పరిశీలించారు. మూతతీసి అలా ఏదో బాగు చేసినట్లు చేశారు. పెట్రోలు పోయించమంటే వెంటనే తెప్పించి పోయించాను.

నేను 'ఇది పొసిగే వ్యవహారం కాదులే. కనీసం ఇది స్టార్టు అయితే గదా ఆయన కొనడానికి బుద్ధిపుట్టేది' అనుకొంటున్నా.

ఇంతలో పెద్ద శబ్దం చేస్తూ కారు స్టార్టు అయ్యింది. ఆయన తల బయటకుపెట్టి "మీరు పెద్దమనుష్యులు. బేరం ఆడకండి. దీనికి అయిదు వేలు ఇస్తాను. మీ కిష్టమేనా" అన్నారు. ఇంతలో నా కారు— ఆ కారు మా ఆవరణదాటి దారిలో అడ్డంవచ్చిన గేటు విరగొట్టి మరో క్షణం రోడ్డుమీదపడి విమానంలా పెద్ద శబ్దంచేస్తూ వెళ్ళిపోయింది.

నేను నోరు తెరుచుకొని అలా చూస్తూ ఉండిపొయ్యాను.

ఆ మర్నాడు పత్రికలో "జర్మన్ ఇంజనీరు సాహసయాత్ర" అనే శీర్షికతో ఒక వార్త ప్రచురించారు. ఆయనగారు మా వూరునుంచి మద్రాసుదాకా ఆ కారులోనే ఎలా కూర్చుని వెళ్లిందీ, దారిలో నా కారు లారీఎక్కి ఎలా సుఖంగా ఎక్కడా దెబ్బతినకుండా ప్రయాణం చేసిందీ ఆ తర్వాత ఓడ ఎక్కి ఎలా ఆయనవెంట జర్మనీ వెళ్ళిందీ వివరంగా వ్రాశారు అందులో.

మరో నెల తర్వాత నాకు జర్మనీ నుంచి ఒక కవరు వచ్చింది. కవరు విప్పి చూశాను. అందులో ఒక కాగితం మడతలో అయిదు వేలకు ఆయన పంపిన చెక్కు కన్పించింది.